రంజాన్ వేళలు

సోమవారం ఇఫ్తార్ : సా.6.30

మంగళవారం సహార్ : ఉ.5.05

అద్వితీయుడైన సృష్టికర్తను మనిషి తనకు మరియు యావత్ యజమాని అని ఆరాధ్యుడని హృదయపూర్వకంగా అంగీకరించాలి. దైవత్వానికి సంబంధించిన సకల గుణగణాలు అధికారాలు సృష్టి కర్తకే అని విశ్వసించాలి





కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఘనంగా సీతారాముల కల్యాణం

నిజామాబాద్ కల్చరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్చరణలతో సీతారాముల కల్యాణం ఘనంగా సాగింది. నగరంలోని సుభాష్‌నగర్ రామాలయంలో ఆదివారం వేదపండితులు సముద్రాల శ్రీధరాచారి స్వామి వేదమంత్రాలు పఠించగా అర్చకులు రాఘవాచార్య కల్యాణ తంతును నిర్వహించారు. కల్యాణంలోని ముఖ్య ఘట్టాలైన పాదప్రక్షాళన, మధుపర్కం, నూతన వస్త్రాల సమర్పణ, జీలకర్రబెల్లం, కణ్యాదానం, మాంగళ్య సూత్రధారణ, తలంబ్రాలు, బ్రహ్మముడి తంతును శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం మహిళలు సీతారాముల వారికి ఒడిబియ్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి మున్సిపాలిటీ కలేనా..!?

- ప్రతీసారి ఎన్నికల సమయంలో మున్సిపాలిటీ ఏర్పాటుపై రాజకీయ నాయకుల ప్రకటనలు
- అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- రూరల్ నియోజకవర్గానికి ప్రధాన కేంద్రంగా డిచ్‌పల్లి

7



పాఠశాలల్లో మోగని వాటర్ బెల్

తప్పనిసరిగా అమలు చేయాలి..
: సురేష్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

విద్యార్థులు గంటకోసారి మంచినీరు తాగేలా ప్రభుత్వ పాఠశాలల్లో ఖచ్చితంగా చర్యలు తీసుకోవాలి. వాటర్ తాగడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించాలి. ప్రస్తుత వేసవి దృష్ట్యా విద్యార్థులు తగినన్ని నీరు తీసుకోవాలి. కేవలం ఇంటర్వెల్ సమయంలోనే నీరు తాగుతున్నారు. దీనివల్ల విద్యార్థులు అనారోగ్యబారిన పడుతున్నారు. గతంలో అమలు చేసిన విధంగా మళ్లీ గంటకోసారి వాటర్ బెల్‌ను అమలు చేయాలి.

రెండు లీటర్ల నీరు తీసుకోవాలి..
:విశాల్, మానసిక వైద్యనిపుణుడు

ప్రస్తుతం వేసవికాలం మొదలైన దృష్ట్యా విద్యార్థులు తప్పనిసరిగా ప్రతీరోజు రెండు లీటర్లకు తగ్గకుండా నీరు తీసుకోవాలి. పదో తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా చదువుపై ఏకాగ్రతను పెట్టి తగినంత నీరు తాగాలి. సక్రమంగా నీరు తాగడం వల్ల శరీరంలో అవయవాలన్నీ సరిగ్గా పనిచేస్తాయి. ఈ విషయమై విద్యార్థుల్లో అవగాహన పెంచాలి. రెండు గంటలకోసారి 250 మిల్లీలీటర్ల నీటిని తాగడం ఎంతో మంచిది.

- జిల్లాలో పెరుగుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- డీహైడ్రేషన్ బారిన పడుతున్న విద్యార్థులు
- వాటర్ బెల్‌ను అమలు చేయాలంటున్న తల్లిదండ్రులు



నిజామాబాద్ అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 40డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు వాటర్ బెల్ లేక డీహైడ్రేషన్ బారిన పడుతున్నారు. విద్యావ్యవస్థలో అనేక మార్పులను తీసుకొస్తున్న ప్రభుత్వం పాఠశాలల్లో మాత్రం వాటర్ బెల్‌ను అమలు చేయడం లేదు. విద్యార్థులు సరిపడా నీరు తాగకపోవడంతో తలనొప్పి, కడుపునొప్పి తదితర వ్యాధులబారిన పడుతున్నారు. గతంలో 2018లో ప్రభుత్వం పాఠశాలల్లో ప్రతీ గంటకోసారి వాటర్ బెల్‌ను అమలు చేసింది. కానీ కోవిడ్ వల్ల సుమారు ఆరు నెలల పాటు విద్యాసంస్థలకు సెలవులు ఉండటంతో ఆ తర్వాత వాటర్ బెల్‌ను ఎక్కడా కూడా అమలు చేయడం లేదు. దీనివల్ల విద్యార్థులు అనారోగ్య బారిన పడుతున్నారు. నీరు బాగా తాగడం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు డీహైడ్రేషన్ బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయి. కానీ ఎక్కడా కూడా విద్యాసంస్థల్లో వాటర్ బెల్‌ను అమలు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఏకాగ్రత లోపించడం వల్ల చదువుపై శ్రద్ధను పెట్టలేకపోతున్నారు. విద్యార్థులు సరిపడా నీరు తాగడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయినప్పటికీ జిల్లాలో ఎక్కడా కూడా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వాటర్ బెల్‌ను అమలు చేయడం లేదు.

జిల్లాలోని పాఠశాలల్లో అందని తాగునీరు..

జిల్లాలో 1156 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా సుమారు 1000 వరకు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. 2లక్షలకు పైగా విద్యార్థులు జిల్లాలో విద్యనభ్యసిస్తున్నారు. గతంలో2018లో ప్రభుత్వ పాఠశాలల్లో వాటర్‌బెల్ కార్యక్రమాన్ని విద్యాశాఖ ప్రారంభించింది. కరోనా వల్ల పాఠశాలలకు సెలవులు ఉండటం ఆ తర్వాత పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటికీ వాటర్ బెల్ కార్యక్రమాన్ని అమలు చేయడం మర్చిపోయారు. విద్యార్థులు పాఠశాలల్లో ఉన్న సమయంలో సుమారు రెండు లీటర్ల వరకు నీటిని తీసుకుంటే బాగుంటుందని వైద్యులు చెబుతున్నారు. వయస్సును బట్టి మూడు నుంచి నాలుగు లీటర్లు తీసుకున్నా ఎలాంటి ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. కానీ విద్యార్థులు తమ ఇంటి నుంచి వాటర్ బాటిళ్లు తీసుకెళ్తున్నా మధ్యాహ్న భోజన సమయంలో తప్ప ఇతర సమయాల్లో నీటిని తాగడం లేదు. కొంత మంది విద్యార్థులు పాఠశాలల్లో ఉండే నీటినే తాగుతున్నారు. దీంతో విద్యార్థుల శరీరానికి కావాల్సిన నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఫస్ట్‌బెల్, సెకండ్ బెల్, ఇంటర్వెల్ ఇలా వాటర్ బెల్ కోసం గంటకొకసారి బెల్ కొట్టేవారు. ప్రస్తుతం ఎక్కడా కూడా వాటర్ బెల్‌ను అమలు చేయడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలల్లో వాటర్‌బెల్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తీవ్రమవుతున్న ఎండలు..

మార్చి నెల ప్రారంభంలోనే ఎండలు తీవ్రతరం అవుతున్నాయి. జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 40డిగ్రీల మధ్య నమోదు అవుతుండగా విద్యార్థులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. వేసవికాలంలో ఖచ్చితంగా శరీరానికి తాగునీరు తగిన మోతాదులో అవసరం ఉంటుంది. తగినంత నీరు తాగకపోతే విద్యార్థులు అనారోగ్య బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. డీహైడ్రేషన్ బారిన పడి విద్యార్థులు ఇబ్బందులు పడతారు. ప్రతీ విద్యార్థి పాఠశాలకు వెళ్లేముందు వాటర్ బాటిల్ వెంట తీసుకొని వెళ్లి గంట గంటకు నీరు తాగాలని వైద్యులు చెబుతున్నారు. పాఠశాలల్లో కూడా గంట గంటకు నీరు తాగేలా జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. వేసవి కాలంలో శరీరంలో అన్ని అవయవాలు సక్రమంగా పనిచేయాలంటే తగిన మోతాదులో నీరు తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. నీరు ఎక్కువగా తీసుకుంటే రక్తం పలుచగా మారి రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. నీటి శాతం తగ్గితే మూత్రపిండాల్లో రాళ్లు, జ్వరం బారిన పడే అవకాశాలు ఉంటాయి. మూత్రంలో ఇన్ఫెక్షన్‌లు, యూసీడీటీ, మలబద్ధకం, మూర్ఛ, కాలేయ, చర్మ వ్యాధుల బారినపడే అవకాశాలు ఉంటాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఖచ్చితంగా తగిన మోతాదులో విద్యార్థులు నీరు తాగడం వల్ల ఆరోగ్యంగా ఉండగలుగుతారని తద్వారా చదువుపై ఏకాగ్రతను పెట్టే అవకాశాలు ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు.

భయంతో నీరు తాగని విద్యార్థులు..

తరచూ నీరు తాగడం వల్ల మూత్రానికి వెళ్లవల్సి వస్తుందనే భయంతో చాలా మంది విద్యార్థులు నీరు తాగడం లేదు. జిల్లాలో అన్ని పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం ఉంది. కొన్నిచోట్ల మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తుండగా మరికొన్ని చోట్ల మినరల్ వాటర్‌ను ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు సక్రమంగా లేకపోవడంతో తరచూ మూత్రం వెళ్లాల్సి వస్తుందన్న భయంతో విద్యార్థులు నీరు తాగడం లేదు. ముఖ్యంగా ఆడపిల్లలు మూత్రశాలలు సక్రమంగా లేకపోవడంతో నీరు తాగలేకపోతున్నట్లు తెలుస్తోంది. పురుషులతో పోలిస్తే ఆడపిల్లలు తగినంత నీరు తాగకపోవడం వల్ల అనారోగ్య బారిన పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి ప్రతీ గంటకోసారి నీరు తాగేలా వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిజాంసాగర్ కెనాల్‌కట్ట కబ్జాకు గురి

- ఇళ్లు, మడిగెల నిర్మాణం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

7

అంతర్రాష్ట్ర బైక్ దొంగల అరెస్టు

- 11బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు
- జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడిన నిందితులు
- వివరాలు వెల్లడించిన నిజామాబాద్ ఏసీపీ

6



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు



పోలీసు స్టేషన్ల అప్‌గ్రేడ్ ఎప్పుడు?

- జిల్లాలో నేరాల నియంత్రణకు చర్యలు
- పోలీసుస్టేషన్ల అప్‌గ్రేడ్‌కు ప్రతిపాదనలు పంపిన అధికారులు
- ఇప్పటి వరకు కార్యరూపం దాల్చని వైనం
- నూతన సీపీతోనైనా సమస్య పరిష్కారమయ్యేనా?

ఖిల్లా, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016లో నిజామాబాద్ ఎస్పీ కార్యాలయాన్ని పోలీసు కమిషనరేట్‌గా అప్‌గ్రేడ్ చేశారు. అనంతరం ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించేందుకు జిల్లాలో కొన్ని మండలాల సంఖ్యను సైతం పెంచుతూ పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశారు. అయితే పోలీసు స్టేషన్ల సంఖ్యను పెంచిన ప్రభుత్వం అక్కడ సరిపడా సిబ్బందిని ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రజలకు మెరుగైన సేవలందించడంలో పూర్తిగా విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసు స్టేషన్ల సంఖ్య పెరిగినా అదే తరహాలో నేరాల సంఖ్య సైతం పెరిగింది. అయితే వాటిని తగ్గించేందుకు అవసరమున్న పోలీసు స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయాల్సిన అవకశ్యతను మరిచారు. నేరాలు ఎక్కువగా జరిగే పోలీసు స్టేషన్లలో వాటి నియంత్రణ కోసం పోలీసు స్టేషన్లను అప్‌గ్రేడ్ చేసే అవకాశాలు ఉన్నాయి. అందుకు గాను గతంలో ఉన్న పోలీసు కమిషనర్లు రాష్ట్ర పోలీసు శాఖకు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. కమిషనరేట్ పరిధిలో మొత్తం 17 స్టేషన్లను గుర్తించి రాష్ట్ర పోలీసు శాఖకు నివేదిక పంపినట్లు తెలిసింది. అయినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. రాబోయే కొత్త కొత్వాల్ సాయిచైతన్య వీటిపై దృష్టిసారించి నేరాలు ఎక్కువగా జరిగే పోలీసు స్టేషన్లను అప్‌గ్రేడ్ చేసి ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించే ప్రయత్నాలు చేయనున్నారా? అనే అంశంపై ప్రజలు వేచి ఉన్నారు. పోలీసు స్టేషన్ల అప్‌గ్రేడ్ వివరాలను రాష్ట్ర పోలీసు శాఖకు పంపినా.. ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు.

మొత్తం 33 పోలీసు స్టేషన్లు..

పోలీసు కమిషనరేట్ పరిధిలో మహిళా పోలీసు స్టేషన్‌తో కలుపుకుని మొత్తం 33 స్టేషన్లు ఉన్నాయి. పోలీసు స్టేషన్లకు వచ్చే ఫిర్యాదులను బట్టి స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉంది. కమిషనరేట్ పరిధిలో రోజు రోజుకూ జనాభా పెరిగి గ్రామపంచాయతీ నుంచి మున్సిపాల్టీ, మున్సిపాల్టీ నుంచి కార్పొరేషన్ స్థాయి వరకు పెరిగినా పోలీసు శాఖలో మాత్రం మార్పు రావడం లేదని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనాభా పెరుగుదలతో పాటు వ్యాపారాభివృద్ధి, విద్యా సంస్థల పెంపుదల విపరీతంగా పెరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో జరిగే నేరాల సంఖ్యను తగ్గించేందుకు పోలీసు స్టేషన్లను అప్‌గ్రేడ్ చేసి వాటిలో సిబ్బందిని పెంచే అవకాశాలు ఎంతైనా ఉంది. ఇప్పటికే రాష్ట్రంలో రామగుండం, ఖమ్మం, సైబరాబాద్ కమిషనరేట్‌లలో పోలీసు స్టేషన్ల అప్‌గ్రేడ్ ప్రక్రియ పూర్తయినట్లు ఆ శాఖాధికారుల ద్వారా తెలిసింది. కమిషనరేట్ పరిధిలో 32పోలీసు స్టేషన్లలో నేరాల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు పోలీసు ఉన్నతాధికారులు గుర్తించారు. ఇందులో 16నుంచి 18పోలీసు స్టేషన్లలో నేరాల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు గతంలో పని చేసిన పోలీసు కమిషనర్లు గుర్తించారు. వీటిని అప్‌గ్రేడ్ చేసి నేరాల సంఖ్యను తగ్గించేందుకు కృషిలో భాగంగా రాష్ట్ర పోలీసు శాఖకు నివేదిక పంపారు. పోలీసు కమి షనరేట్‌ల వారిగా నేరాల సంఖ్యను తగ్గించేందుకు రా ష్ట్ర ప్రభుత్వం ఆయా పోలీసు స్టేషన్ల వారీగా వివరాల నివేదిక పంపాలని సంబంధిత పోలీసు కమిషనర్లకు ఆదేశాలు జారిచేసినట్లు తెలిసింది. ఈ మేరకు నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని నేరాల సంఖ్య ఎక్కువగా ఉన్న పోలీసు స్టేషన్ల వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి అందించినట్లు సమాచారం. అయినా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచిఆదేశాలు రాలేదు.

అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్లలో సిబ్బంది..

నేరాల సంఖ్య ఎక్కువగా ఉన్న పోలీసు స్టేషన్లను అప్‌గ్రేడ్ జరిగితే సిబ్బంది సైతం పెరుగుతారు. సీఐలకు ఎస్‌హెచ్‌వోలు ఉంటారు. స్టేషన్ పరిధిని బట్టి ఎస్సైలు, ఏఎస్సైలు,హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల సంఖ్య పెరుగుతుంది. సిబ్బంది సంఖ్య పెరగడం వల్ల ప్రజలకు మెరుగైన పోలీసు సేవలతో పాటు సత్వర న్యాయం జరిగే అవకాశాలు ఉంటాయి. ఇటీవల కానిస్టేబుళ్లగా శిక్షణ పొందిన వారిని అన్ని పోలీసు స్టేషన్ల వారీగా ఒక్కో స్టేషన్‌కు 5నుంచి 10మంది వరకు కేటాయించారు. దీంతో పోలీసు స్టేషన్లలో గతంలో కంటే కానిస్టేబుళ్ల సంఖ్య పెరిగింది. దీంతో స్టేషన్లకు వచ్చే ఫిర్యాదు దారులకు వారు సేవలను సకాలంలో అందిస్తున్నారు. పోలీసు స్టేషన్లలో కానిస్టేబుళ్ల సంఖ్య పెరుగడం వల్ల అప్‌గ్రేడ్ చేయ డానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని పోలీసు శాఖలో చర్చలు జరుగుతున్నాయి.



రైతు భరోసాకు నిరీక్షణ!

- యాసంగి ముగుస్తున్నా పూర్తిస్థాయిలో రైతులకు అందని ఆర్థిక సహాయం

కామారెడ్డి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుభరోసా పథకం పెట్టుబడి సాయం నిధుల కోసం పలువురు రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. ఒక ఎకరం భూమి ఉన్నరైతుకు ఆ భూమిలో సగానికి కూడా పెట్టుబడిసాయం జమకాలేదు. ఎక్కు వభాగం రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. దీంతో రైతుభరోసా కాస్త కోతల భరోసాగా మారిందని రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు విడ తల్లో రైతుభరోసా జమచేశామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొంటున్నాయి.

రూ.311 కోట్లు అవసరం

కామరెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ పరిధిలో మొత్తం 25 మండలాల్లోని 104 వ్యవసాయ క్లస్టర్‌లు ఉన్నాయి. ఈ క్లస్టర్‌ల పరిధిలో 5,15,920 ఎకరాలల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుభరోసా పథకానికి 3,27,713మంది రైతులు అర్హులుగా గుర్తించారు. వీరి వివరాలను రైతుభరోసా పథకం నిధులను జమచేసేందుకు ప్రభుత్వానికి నివేదించి ట్రేజరీకి సమర్పించారు. వీరందరికి రైతుభరోసా కింద రూ.311.27కోట్లు నిధులు అవసరం కానున్నాయి. ఈ నేపథ్యంలో జనవరి 26నుంచి భరోసా పథకాన్ని ప్రభుత్వం అమలుచేసింది. పైలెట్ ప్రాజెక్ట్ కింద ఒక్కో మండలంలో ఒక్కో గ్రామాన్ని ఎంపికచేసి అర్హులైన గ్రామాలకు నిధులను జమచేసింది. ఇలా మొదటి విడతలో జిల్లాలో ఎంపికచేసిన 22 గ్రామాల పరిధిలో 13,917 ఎకరాలకు రూ.8.35 కోట్ల నిధులను విడుదల చేసి రైతుల ఖాతాలో జమచేసింది. ఇలా ఇప్పటివరకు మూడు విడతల్లో రైతుభరోసా పథకం కింద మూడెకరాల వరకు ఉన్న రైతులకు నిధులను ఖాతాలో జమ చేస్తు వస్తుంది.

కామారెడ్డి జిల్లాలో 30 శాతం మంది రైతులకు అందని పెట్టుబడి సాయం

ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా గత నెల 26న రైతుభరోసా పథకాన్ని అమలుచేసిన విషయం తెలిసిందే.అయితే రెండునెలలు గడుస్తున్నా పెట్టుబడిసాయం నిధులు పూర్తిస్థాయిలో జమకాకపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటివరకు పలు విడతల్లో పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అర్హులైన రైతుల ఖాతాలో నిధులను జమచేసింది. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో ఇప్పటివరకు 2,67,340 మంది రైతుల ఖాతాలో రూ. 180 కోట్లనిధులు జమ అయినట్లు వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు 70శాతం మంది రైతులకే పెట్టుబడిసాయం అందింది. అయితే మరో 30శాతం మంది రైతులకు పెట్టుబడిసాయం అందలేదు.

యాసంగి ముగుస్తున్నా అందని రైతుభరోసా

యాసంగి సీజన్ ముగుస్తున్నప్పటికీ రైతుభరోసా పెట్టుబడిసాయం అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్చి31లోగా అర్హులైన రైతులందరికీ పెట్టుబడిసాయం అందజేస్తానని ప్రభుత్వం చెబుతుంది. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు పథకం పెట్టుబడిసాయం కింద ఎకరానికి రూ.5వేలు ఇవ్వగా ప్రస్తుత ప్రభుత్వం రైతుభరోసా కింద రూ.6వేల చొప్పున అందిస్తోంది. అయితే ఈ పథకం కింద ఇప్పటికీ చాలామంది రైతులకు భరోసా నిధులు అందలేదు. ఎకర, రెండు, మూడుఎకరాలలోపు రైతులకు విడుతల వారిగా నగదు జమచేస్తుంది. కానీ కొందరికి నగదు జమకాకపోవడంతో బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఎందుకు డబ్బులు పడలేదని వ్యవసాయ అధికారులను ప్రశ్నిస్తున్నారు. వివిధ కారణాలతో నగదు జమకాలేదని వారు చెబుతున్నారు. కొందరు రైతులు సేవింగ్ ఖాతాలకు బదులు పంట రుణం ఖాతా నంబర్లు ఇచ్చారని ఆధార్, బ్యాంక్‌పాస్‌బుక్కుల పేర్లలో తప్పిదాలు భూములు కొనుగోలుచేసిన కొత్త రైతులు తదితర కారణాలతో నగదు జమకాలేదని వివరాలు పరిశీలించి రైతులకు తెలియజేస్తున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గుంజిలి వీడీసీ సభ్యులు

ఆర్మూర్‌రూరల్, మార్చి9(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని మాక్లూర్ మండలం గుంజిలి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కలిశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి రావాలని కోరుతూ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంజిలి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలోని ధర్మోరా గ్రామంలో వేంకటేశ్వరస్వామి నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ పూజారులు, వేదపండితులు ఎమ్మెల్యేరాకేష్‌రెడ్డికి ఆశీర్వదించారు.అంతేగాక ఆలయ నిర్మాణకర్తలు ముస్కుఅనుప్‌కుమార్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డిలు ఎమ్మెల్యేకు శాలువతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పూజలు చేసి వేదపండితుల ఆశీస్సు లు పొందారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనుచరులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, మార్చి9(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు, యువత డ్రగ్స్, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఆర్మూర్ ఏసీపీ వెంక టేశ్వర్ రెడ్డి అన్నారు.ఆదివారం పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో తెలంగాణ యాంటి నార్కోటిక్స్ బ్యూరో వారు డ్రగ్స్ నియంత్రణ కోసం ముద్రించిన అవగాహన పోస్టర్లను ఏసీపీ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏసీపీవెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువత మంచి ఆలోచనలతో ముందుకు సాగాలని,దేశభవిష్యత్‌కు తోడ్పాటు నందించాలన్నారు. చెడుఅలవాట్లకు,వ్యసనాలకు దూరంగా ఉం డాలని సూచించారు. డ్రగ్స్‌మత్తుపదార్థాలను నిరోధించడానికి పో లీస్ శాఖ ఎల్లవేళల కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐశ్రీధర్‌రెడ్డి, పట్వారి తులసీకుమార్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ లీకేజీని అరికట్టాలి

నవీపేట,మార్చి9(ఆంధ్రజ్యోతి): నవీపేట గ్రామ పంచాయతీ పరిధిలోని శివాజీనగర్ కాలనీ సమీపంలో తాగునీటి పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. నాలుగు రోజుల క్రితం తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి నీరు వృథా వెళ్తుందని దీంతో స్థానిక 1, 2వ వార్డులలో నీటి కొరత ఏర్పడిందని వారు పేర్కొన్నారు. వెంటనే సంబంధిత పైపులైన్‌కు మరమ్మత్తులు చేసి తాగునీటి సరఫరా సక్రమంగా జరిగే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

కోటగిరి,మార్చి9(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని లింగంపల్లి శివారులో బోధన్, రుద్రూర్ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బోధన్ నుంచి వర్ని వైపు వస్తున్న కారును రుద్రూర్ నుంచి బోధన్ వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న శివప్రసాద్, రాజేష్ బాలాజీ, భాగ్యశ్రీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు తరలిన విద్యార్థులు



ఎయిర్‌పోర్ట్ వద్ద విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

రెంజల్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు వైజ్ఞానిక విహార యాత్రకు వెళ్లారు. ఇందులో భాగంగా పీఎంశ్రీ జడ్పీహెచ్‌ఎస్ రెంజల్ విద్యార్థులు హైదరాబాద్‌లోని ఐఐటీ ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, తెలంగాణ పోలీస్ అకాడమీ, గోల్కొండ ఫోర్ట్, నెహ్రూ జూలాజికల్ పార్క్, రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌తో పాటు అనేక ప్రదర్శనలు విద్యార్థులకు చూపించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో ఆంజనేయులు ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధరప్ప, సుధాకర్, గంగాధర్, అరవింద్, కిషోర్, నాందేవ్, శేఖర్, జగదీష్, నరేందర్, లక్ష్మణ్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

‘చంద్రబోస్ ఆశయ సాధనకు పోరాడుదాం’



చంద్రబోస్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు పోరాడుదామని సీపీఐ ఎంఎల్ బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ 50ఏళ్ల తన ఉద్యమ ప్రస్థానంలో ప్రజా ఉద్యమాల కోసం ఎన్నో త్యాగాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పడాల శంకర్, సీతారాం, కబీర్ ఖాన్, సాయిలు, నారాయణ, శంకర్, ప్రభాకర్, హన్మంతు, రాజేందర్ సింగ్, రాములు, పోశెట్టి, కలీం తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడిన కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ సేవలు మరువలేనివని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు పార్వతి రాజేశ్వర్, పుట్టి నాగన్న అన్నారు. ఆదివారం మండలంలోని బోర్గాం గ్రామంలో కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఒడ్డెన్న, నసీర్, పెద్దులు, సిద్ద పోశెట్టి, లక్ష్మణ్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన



అంబేద్కర్‌చౌరస్తాలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



పొతంగల్‌లో నిరసన దీక్ష చేపట్టిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆర్మూర్‌టౌన్, మార్చి9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు మైలారం బాలు మాటాడుతూ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెటుకోవాలని, ఎస్సీవర్గీకరణ అమలు చేయకుండా గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్ -3 ఫలితాలను విడుదల చేయడం ఆపాలని, నియమకాల్లో వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుంటే మాదిగలను మోసం చేసినట్టే అవుతుందని, గ్రూప్స్ ఉద్యోగాల్లో మాదిగలకు న్యాయం జరగకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి చే పూరి శ్యామ్, మండల అధ్యక్షుడు మైలారం రాము, ప్రధానకార్యదర్శి నూత్‌పల్లి సంతోష్, కోశాధికారి మంగళం రవి, రాజగంగారాం, సంకేపల్లి విప్లవ్, ఎడపల్లి సంతోష్, తరుణ్, రాజ్, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: పొతంగల్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరవధిక నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పోచీరాం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతోనే 59ఉప కులాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు నిరవధిక నిరసన దీక్షలు కొనసాగుతాయన్నారు. ఏబీసీడీ వర్గీకరణ అమలు చేసి తమ బిడ్డల భవిష్యత్‌కు బాటలు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు యాదవరావు, సాయిలు, సంగయ్య, లాలయ్య, బాలయ్య, వెంకటి, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

మోపాల్: ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో మోపాల్ తహసీల్దార్ కార్యాలయానికి వినతిపత్రం సమర్పించారు.గతకొన్ని సంవత్సరాల నుంచి మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ చేయాలని పోరాటం చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించ డం లేదని ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ రూరల్ రాష్ట్ర నాయకులు నాగభూ షణం మండిపడ్డారు. ఆదివారం మోపాల్ తహసీల్దార్ కార్యాలయానికి తమ డిమాండ్లతో ఉన్న వినతిపత్రాన్ని సమర్పించారు. ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెడితే కేంద్రం ప్రభుత్వం కూడా ఆమోదం తెలిపే అవకాశం ఉందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ అయ్యేంతవరకు తమ ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో గంగమల్లు,సాయిలు, తిరుపతి నాయకులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠా అరెస్టు

● ఘరానా నిందితుల అరెస్టు వివరాలను వెల్లడించిన నిజామాబాద్ ఏసీపీ



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

నవీపేట,మార్చి9(ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠాను పట్టుకుని వారి వద్ద నుండి 11బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి తెలిపారు. ఆదివారం నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఏ1 నిందితుడు అయిన తహసీన్ ఖాన్ అలియాస్ అర్బాన్ నిజామాబాద్‌లోని నిజాం కాలనీకి చెందిన వాడు కాగా ఏ2 సయ్యద్ సోహెల్ మహరాష్ట్రలోని నాందేడ్ జిల్లా ఉమ్రికి చెందిన వాడని ప్రస్తుతం అతడు నిజామాబాద్‌లోని భారతిరాణి కాలనీలో నివసిస్తున్నాడని ఆయన పేర్కొన్నారు. ఏ1 నిందితుడైన అర్బాన్ నవీపేటకు చెందిన యువతిని కొన్ని సంవత్సరాల క్రితం వివాహం చేసుకుని గత కొంతకాలంగా నవీపేటలోనే నివాసం ఉంటున్నాడని అన్నారు. మేస్త్రీ పని చేసుకుంటూ జీవించే అతడు వచ్చిన డబ్బులను కుటుంబ అవసరాలకు, తాగడానికి, జల్సాలకు సరిపోకపోవడంతో అప్పుడప్పుడు చిన్నచిన్న దొంగతనాలు చేసేవాడని అన్నారు. అదే క్రమంలో నవీపేటలోని మేకల సంత, కూరగాయల సంతలతో పాటు రోడ్డు వెంబడి నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను తాళాలు తీసి మహరాష్ట్ర, చుట్టు పక్కల ఏరియాలలో అమ్మేసేవాడని అన్నారు. వచ్చిన డబ్బులతో మద్యం సేవించడం జల్సాలకు వాడుకునేవాడని ఆయన పేర్కొన్నారు. గతంలో తన బావమర్ది అయిన సలీంతో కలిసి పలు నేరాలలో పాల్గొనగా అతడిపై నవీపేట పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేయబడి ఉండగా పలుమార్లు జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చాడని ఆయన వివరించారు. నిందితులు సుమారు నాలుగు రోజుల క్రితం నవీపేటలోని గంగా వైన్స్ షాప్ ముందు పార్కింగ్ చేసి ఉన్న హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ మోటార్ సైకిల్‌ను దొంగతనం చేశారని అన్నారు. దీంతో పాటు నవీపేటలో ఐదు బైక్‌లు, రెంజల్‌లో ఒకటి, బోధన్ టౌన్‌లో ఒకటి, నిర్మల్ జిల్లా బాసరలో ఒకటి బైక్‌లను దొంగతనం చేశారని అన్నారు. అంతే కాకుండా ఏ2 అయిన సయ్యద్ సోహెల్‌తో కలిసి నవీపేటలో ఇంకొక్క బైక్ దొంగతనం చేసి ఈ బైక్‌లన్ని ఏ1 ఇంటి వెనుకల రహస్యంగా దాచి పెట్టి వీటన్నింటిని ఇద్దరు కలిసి మహరాష్ట్రలో ఇంకా కొన్ని బైక్‌లను దొంగతనం చేశాక అన్ని కలిసి అమ్ముకుందామని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా నవీపేటలో మేకల సంత ఉందని మళ్లీ ఇద్దరం కలిసి కొన్ని బండ్లు దొంగిలించాలని వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారని అన్నారు. అంతే కాకుండా ఏ2 అయిన సయ్యద్ సోహెల్ మహరాష్ట్రలోని ఉమ్రి, ధర్మాబాద్, బోకర్‌లలో కూడా పలు దొంగతనాలకు పాల్పడట్లు ఆయన వివరించారు. వివిధ కోణాల్లో పరిశోధించి జరిగిన అంతర్రాష్ట్ర కేసులలో నిందితులుగా ఉన్న తహసీన్ ఖాన్, సయ్యద్ సోహెల్‌ను పట్టుకున్న నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, నవీపేట ఇన్‌చార్జి సబ్ ఇన్స్‌స్పెక్టర్ లక్ష్మయ్య, మాక్లూర్ ఎస్‌ఐ రాజశేఖర్, 5వ టౌన్ ఎస్‌ఐ గంగాధర్, క్రైమ్ పార్టీ సిబ్బందిని నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి అభినందించారు.

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య



బోర్గం(కే)లో మాట్లాడుతున్న భూమయ్య

మాక్లూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పూర్ భూమయ్య, దేశెట్టి సాయిరెడ్డిలు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బోర్గం(కే)లో వారు మాట్లాడుతూ రైతులకు రూ.2 లక్షల రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని, రైతు భరోసా అందరికి అందజేయాలని, రైతులకు ఇచ్చిన హామీమేరకు రైతు భరోసా, ఎకరానికి రూ.15వేలు బదులు రూ.12వేలు ఇవ్వడం ఎంత వరకు సరికాదని రైతులందరికీ రైతు భరోసా అందజేశారు. ఇతర పంట ధాన్యాలకు రూ.500 బోనస్ ఇవ్వాలని, చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించి ప్రభుత్వమే నడిపించాలని అన్నారు. రబీలో వేసిన పొలాలు ఎండిపోతున్నాయని, వనీ రందించే పంట పొలాలను ఎండు పంటలను పరిశీలించి ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం అందించాలని కోరారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో ఈనెల 11న జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యదర్శి జిల్లా నాయకులు చిన్నయ్య, గోపాల్, సాయిలు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు

రవన్న స్ఫూర్తితో ఉద్యమిద్దాం

ఆర్మూర్‌టౌన్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): రాయల రవన్న అమరత్వ స్ఫూర్తితో ఉద్యమిద్దామని జిల్లా న్యూడెమోక్రసీ సహాయకార్యదర్శి దాసు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివా రం మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రాయల సుబాష్‌చంద్రబోస్ అలియాస్ రవన్న 9వ స్మారకసభను నిర్వహించారు. ఈ సందర్భంగా రవన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. అనంతరం జిల్లా సహాయకార్యదర్శి దాసు మాటాడుతూ విద్యార్థి దశలో విప్లవ రాజకీయాలు నేర్చుకొని దోపిడీపీడన లేని రాజ్యం కోసం అజ్ఞాతవాసిగా ఉండి పార్టీని నడిపించిన రవన్న అతిమీది వాదానికి వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ సబ్‌డివిజన్ కార్యదర్శి సూర్యశివాజీ, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు సూరిబాబు, పీవైఎల్ జిల్లా మాజీ అధ్యక్షుడు రవి, ప్రిన్స్, రంజిత్, హుస్సేన్, వర్ధరెడ్డి, అలీం, బాష, మహమ్మది, రాహుల్, కళ్యాణ్, పవన్, రహమన్, తదితరులు పాల్గొన్నారు.

తొర్లికొండలో విగ్రహాల ప్రతిష్ఠాపన



భక్తిప్రవచనాలు చేస్తున్న దేవనంద జీయర్‌స్వామి



హాజరైన మహిళ భక్తులు

జక్రాన్‌పల్లి, మార్చి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం లో అలివేలు మంగమ్మ, పద్మావతిల విగ్రహమూర్తులు ఉత్సవాలు ఆదివారం భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ విగ్రహాలను ఊరేగింపుగా నిర్వహించి ఆలయంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా యజ్ఞం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు తెలంగాణ దేవనం దజీయర్‌స్వామి హాజరయ్యారు. అనంతరం భక్తులకు భక్తిప్రవచనాలు చేశారు. ఆలయం వద్ద భక్తులు కోసం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, బ్రాహ్మణ్‌పల్లి సింగిల్‌విండో చైర్మన్ కాట్‌పల్లి నర్సారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు కలుషితం !



మిషన్‌భగీరథ ద్వారా కలుషితమైన తాగునీరు

జక్రాన్‌పల్లి, మార్చి9(ఆంధ్రజ్యోతి): ఒక రోజు కాదు రెండు రోజులు కాదు ఏకంగా 20 రోజుల నుంచి మిషన్ భగీరథ ద్వారా కలుషిత తాగునీరు రావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కలుషితమైన నీరు తాగితే అనారోగ్యపాలవుతామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే .. జక్రాన్‌పల్లి మండలం చిన్నగుట్ట ప్రాంతంలో ఉన్న మిషన్ భగీరథ ప్రాజెక్టు ద్వారా అర్గుల్ గ్రామంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు ఈ మిషన్ భగీరథ తాగునీరు సరఫరా చేస్తున్నారు. గత 20 రోజుల నుంచి అర్గుల్ గ్రామానికి ఈ మిషన్ భగీరథ ద్వారా అర్గుల్ గ్రామానికి తాగునీరు కలుషితమైనవి సరఫరా చేస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీరు ఎర్రగా పసుపు రంగులో సరఫరా కావడంతో కలుషితమైన నీరు తాగడం వల్ల అనారోగ్యపాలవుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే తాగునీరును కలుషితం కాకుండా చూడాలని, మంచినీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రిపుల్‌ఐటీని సందర్శించిన ఏర్గట్ల విద్యార్థులు



బాసర ట్రిపుల్‌ఐటీలో ఏర్గట్ల విద్యార్థులు

ఏర్గట్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిది, పదోతరగతి విద్యార్థులు బాసర ఐఐటీ కళాశాలను సంద ర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి మాట్లాడుతూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి కోసం ఫీల్డ్ ట్రిప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని, అందులో భాగంగా ఐఐటి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని సాంకేతిక విద్య విద్యార్థులకు ఏ విధంగా ఉపయోగపడుతుంది. దాని వల్ల భవిష్యత్తులో ఎలాంటి ఉప యోగాలుంటాయో విద్యార్థులకు తెలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాణి, ఉపాధ్యాయులు ప్రసాద్, రాజశేఖర్, విజయ్, రాజనర్సయ్య, నరేష్, సబిత విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ సరస్వతి పాఠశాలలో ఫేర్‌వెల్



ఫేర్‌వెల్ వేడుకల్లో నృత్యాలు చేస్తున్న శ్రీ సరస్వతి విద్యామందిర్ విద్యార్థినులు

భీమ్‌గల్, మార్చి9(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని శ్రీ సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో ఫేర్‌వెల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ బసంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల తమ ప్రాథమిక విద్యస్థాయిలో లక్ష్యాన్ని ఏర్పర్చుకొని చదువులో ముందుకు సాగి జీవితంలో ఉన్నత స్థానంలో నిలిచి తల్లిదండ్రులకు చదువుకున్న పాఠశాలకు, గురువులకు మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. అనం తరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నాటిక ప్రదర్శనలు ఎంతగానో అలరించారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లునర్సయ్య, శ్రీధర్,పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, ఏవోనర్సారెడ్డి, ఉపాధ్యాయులు రవికుమార్, పాల్గొన్నారు.

‘అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుందాం’

బోధన్‌రూరల్,మార్చి9(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలం భవానీపేట్ గ్రామంలో రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని అందరం కలిసి కట్టుగా ఏర్పాటు చేసుకుందామని, గ్రామాభివృద్ధి తోడ్పడుదామని ఆదివారం గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా మా గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పే విషయంలో దుష్ప్రచారం, అవాస్తవాలు వస్తున్నాయన్నారు. గ్రామంలోని ప్రజలందరు విగ్రహ ఏర్పాటుకు ఎటువంటి అభ్యంతరం లేదని మేము అందుకు గర్వ పడుతున్నామన్నారు. ఏదైతే ప్రతిపాదిత స్థలం ఉన్నదో అతి గ్రామస్థుల ఏకాభిప్రాయంతో కలిసికట్టుగా నిర్ణయం తీసుకుని ముందుకు వెళ్లాలని ప్రభుత్వ అధికారులు గ్రామాన్ని సందర్శించి ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించి అందరి ఏకాభిప్రాయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసుకుందామని గ్రామాభివృద్ధికి తోడ్పడుదామని గ్రామస్థులు, పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



చోరీ కేసులో అరెస్టు అయిన నిందితుడితో పోలీసులు

జక్రాన్‌పల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో తొర్లికొండ గ్రామానికి చెందిన నూనె కిరణ్ అనే పాత నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ పంపినట్టు డిచ్‌పల్లి సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి ఎస్సై సీహెచ్. తిరుపతి తెలిపారు. ఆదివారం డిచ్‌పల్లి సీఐలు మల్లేష్, జక్రాన్‌పల్లి ఎస్సై సీహెచ్.తిరుపతి, తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తొర్లికొండ గ్రామానికి చెందిన వేముల భూలక్ష్మీ ఈనెల 7న ఇంటికి తాళం వేసి తన కూతురు వద్దకు వెళ్లగా గుర్తుతెలియని దొంగలు ఆమె ఇంటి తాళలు పగులగొట్టి ఇంట్లోకి వెళ్ళి బీరువాలో ఉన్న బంగారు వెండి ఆభరణాలు చోరీ చేసి పారిపోయారని తెలిపారు. బాధితురాలు వేముల భూలక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. డిచ్‌పల్లి సీఐ మల్లేష్, ఎస్సై సీహెచ్.తిరుపతి, పోలీస్ సిబ్బంది కలిసి చాకచక్యంగా వ్యవహరించి అదే గ్రామానికి చెందిన నూనెకిరణ్ పాత నేరస్థుడిని పట్టుకొని విచారించి అతని వద్ద నుంచి బంగారు ఆభరణాలు, ఒక ఐరన్ బ్యాక్సును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

అమృతాపూర్‌లో దొంగల బీభత్సం



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

డిచ్‌పల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమృతాపూర్ గ్రామంలో తాళ్ల మురళీధర్‌గౌడ్ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చొరబడి ఆరు వేల నగదు, వెండి ఆభరణాలు ఎత్తికెళ్లినట్లు డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగిందని స్థానికులు తెలిపారు. వేరే గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యక్రమానికి వెళ్లిన కుటుంబ సభ్యులు విషయం తెలుసుకొని హుటాహుటిన ఇంటికి తిరిగివచ్చారు. ఘటనాస్థలాన్ని ఏఎస్సై సత్యం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుస్తుల పంపిణీ

కోటగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని జల్లాపల్లి ఫారంలో ఆదివారం రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సామాజిక సేవా కార్యకర్త ఎంఏ హకీం నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ దుస్తులను పంపిణీ చేశారు. గ్రామంలోని 120మంది పేద ముస్లిం కుటుంబాలకు తన వంతు సాయంగా దుస్తులను అందజేశారు. 10వ తరగతి విద్యార్థులకు ఆల్ఇన్‌వన్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏజాజ్ ఖాన్, షేరు, నాయకులు రాములు, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రాచీన ఆలయాలను పునర్నిర్మిస్తే మోక్షం కలుగుతుంది

● హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి



నందిపేటలో సాంబయ్య గుడి భూమి పూజ కార్యక్రమంలో మాట్లాడుతున్న హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి

నందిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పురాతన, ప్రాచీనమైన ఆలయాలను పునర్నిర్మిస్తే ప్రజలందరికీ మోక్షం కలుగుతుందని హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతీ స్వామి అన్నారు. ఆదివారం నందిపేట మండల కేంద్రంలోని కొత్త బైపాస్ రోడ్డులో ఉన్న పురాతన ఆలయమైన సాంబయ్య (శివుడు) గుడి పునర్నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఆలయంలోని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. వచ్చిన భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి మాట్లాడుతూ ఆలయాల నిర్మాణం ప్రారంభిస్తే దేవుడు ఏదో రూపంలో దారి చూపుతారని పేర్కొన్నారు. ప్రాచీన, పురాతన ఆలయాలకు అటువంటి శక్తి ఉంటుందని తెలిపారు. రోజూ దేవున్ని కొలిస్తే భక్తి పెరుగతుందని దానితోనే హిందుత్వం బలపడుతుందని హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతీ స్వామి గుర్తు చేశారు. ప్రపంచంలో హిందుత్వం కంటే గొప్పది మరోకటి లేదని ఉద్ఘాటించారు. ప్రస్తుతం భారత దేశం హిందుత్వంతోనే నడుస్తుందని, దీనికి నిదర్శనం ఇటీవల జరిగిన మహా కుంభమేళలో సుమారు 60 నుంచి 70 కోట్ల ప్రజలు స్నానమాచరించడమేనని చెప్పారు. ఇదే హిందుత్వం ప్రపంచమంతా పాకిందని, అందుకే ఎన్నో దేశాల ప్రజలు కుంభమేళను సందర్శించడమేనని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి గుర్తు చేశారు. అనంతరం ఆయన భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, భక్తులు తదితరులు ఉన్నారు.

బినోలలో ముగిసిన ఆలయాల ఉత్సవాలు




బినోలలో శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొన్న హంపీ పీఠాధిపతి



మహా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తూ..

నవీపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బినోలలోని శ్రీ సింధూర సిద్ధి వినాయక స్వామి ఆలయ జీర్ణోద్ధరణ, పునః ప్రతిష్ఠాపన శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి, శ్రీ రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాప, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ పుష్కర కుంభాభిషేక మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. గత మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన ఆదివారం ప్రాతఃకాల పూజ, యంత్ర ప్రతిష్ఠ, మూర్తి ప్రాణ ప్రతిష్ఠ, మహపూజ, బలి, మహ పూర్ణాహుతి, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ పుష్కర కుంభాభిషేకంలో భాగంగా 365కలశాలతో కుంభాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామి, మల్లారం ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ పిట్ల కృష్ణ మహరాజ్, గ్రామ పురోహితులు కృష్ణ ప్రసాద్ జోషి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం



వన్నెల్(బి)లో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ముప్కాల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం వన్నెల్ (బి) గ్రామంలోని ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం గోవింద నామ స్మరణలతో కమనీయంగా జరిగింది. ఆదివారం ఉదయం స్వామివారి ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అందంగా అలంకరించి ఎదుర్కోలుగా భాజా భజంత్రీలతో ఆలయంలోని మండపానికి తీసుకువచ్చారు. వేద మండితుల మంత్రోశ్చరణల మధ్య శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణం తిలకించి దర్శనం కోసం బారులుతీరారు. ఆలయంలో అన్నదానం నిర్వహించగా అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా రథోత్సవం వైభవంగా సాగింది. రాత్రి ఉత్సవ మూర్తులకు ఏకాంతసేవ, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

కుకునూర్ పాఠశాల విద్యాభివృద్ధికి వినూత్న ప్రణాళిక

వేల్పూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం కుకునూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు హరిచరణ్, ఉపాధ్యాయులతో విద్యాభివృద్ధి కోసం వినూత్న కార్యక్రమం చేపట్టారు. పాఠశాల పదవ తరగతిలో 31మంది విద్యార్థులను ఏడు గ్రూపులుగా ఏర్పాటు చేసి ఒక్కో గ్రూప్‌కు సబ్జెక్టు ప్రకారం ఏడుగురు ఉపాధ్యాయులను బాధ్యతలు అప్పగించారు. అందులో పతాని గంగాధర్ (తెలుగు), సురేష్(హిందీ), నాగరాజ్(ఇంగ్లీష్), జి.రవీందర్ (గణితం), శ్రీధర్‌రావు (ఫిజికల్ సైన్స్), చరణ్‌దాస్(బయోసైన్స్), మల్కన్న (సోషల్), అశోక్(పరిశీలకుడు)గా నియమించారు. ఉపాధ్యాయులు ప్రతీరోజు ఉదయం 5గంటలకు విద్యార్థులకు ఫోన్‌ల ద్వారా నిద్రలేపి చదువుకునేలా ప్రోత్సహించడం చేస్తున్నారు. రాత్రి 7నుంచి 10గంటల వరకు హెచ్‌ఎం హరిచరణ్, ఉపాధ్యాయ బృందం విద్యార్థుల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులను కలిసి విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్న తీరును అడిగి తెలుసుకుంటున్నారు. విద్యార్థులు ఉదయం, రాత్రి చదువుతున్నారా సెల్‌ఫోన్‌లు, టీవీలు చేస్తున్నారా అనే విషయాలను తల్లిదండ్రులను అడుగుతూ తెలుసుకున్నారు. పరీక్షలు ముగిసే వరకు టీవీలకు, ఫోన్‌లకు దూరంగా ఉండేల తల్లిదండ్రులకు సూచనలు చేస్తున్నారు.



విద్యార్థుల ఇంటింటికి పలు సూచనలు చేస్తున్న ఉపాధ్యాయులు

పని బారెడు.. వేతనం మూరెడు!

● మెప్మా రీసోర్స్ పర్సన్‌లకు 3 నెలలుగా అందని జీతాలు ● జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో 95 మంది ఆర్‌పీలు



సమీక్షలో పాల్గొన్న ఆర్‌పీలు, సంఘ సభ్యులు (ఫైల్)

కామారెడ్డిటౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పథకాలు తీసుకువచ్చిన మున్సిపాలిటిలలోని ప్రజలకు అందించే ఆర్‌పీలు ఆర్థిక కష్టాలతో నానా అవస్థలు పడుతున్నారు. ఇంతా చేస్తున్న తమకు అందించే జీతం మాత్రం మూరేడే ఇస్తు భారేడు పనిని చేయిస్తున్నారని వాపోతున్నారు. పోని ప్రభుత్వం అందించే ఆ మూరేడు జీతా లైన నెలనెలకు అందిస్తున్నారా అంటే అదిలేదని గత 3 నెలలుగా వేతనాలు అందడం లేదని ఆర్‌పీలు పేర్కొంటున్నారు. ప్రభుత్వ పథకాలు, ఎన్నికల విధులు, మహిళ సంఘాలకు సంబంధించిన పన్నులన్నింటిని ఆర్‌పీలే చేస్తున్నారు. అయినప్పటికి వారికి నెలనెల వేతనాలు అందని పరిస్థితి నెలకోనడంతో తమ కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆర్‌పీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలలతరబడి అందని జీతాలు

ఆర్‌పీలకు నెలకు ప్రభుత్వంనుంచి అందే వేతనాలు రూ.6 వేలు, మహిళా సమాఖ్యద్వారా మరో రూ.2 వేలు చెల్లిస్తుంటారు. కానీ ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.6 వేలు 3 నెలలుగా అందడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పథకం తీసుకువచ్చిన పట్టణ ప్రజలకు చేరువ చేసేందుకు తమతో పనులు చేయించడంలో చూపుతున్న శ్రద్ధ తమ జీతాలు చెల్లించడంలో మాత్రంచూపడంలేదని విమర్శలు ఆర్‌పీల నుంచి వ్యక్తం అవుతున్నాయి.ఎన్ని ప్రభుత్వాలు మారిన తమ బతుకులు మాత్రం మారడం లేదని ఆర్‌పీలు పేర్కొంటున్నారు.చాలిచాలని వేతనాలతో పనిచేస్తున్న ఆ వేతనాలను సైతం నెలలతరబడి ఆపడంపై మండి పడుతున్నారు.

మూడు మున్సిపాలిటీల్లో 95 మంది..

జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల్లో మొత్తం 95మంది పనిచేస్తున్నారు. ఇందులో కామారెడ్డిలో 63, ఎల్లారెడ్డి10, బాన్సువాడలో 22 మంది ఆర్‌పీలు ఆయా మున్సిపల్ వార్డుల పరిధిలో మహిళ సమైఖ్యలో తమ విధులను నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటిల్లో ఎస్‌హెచ్‌జీ, ఎస్‌ఎల్‌ఎఫ్, టీఎల్‌ఎఫ్‌లకు బుక్ కీపింగ్, మహిళలకు బ్యాంకు రుణాలు, స్త్రీనిధి నుంచి రుణాలను ఇప్పించడం ఆ రుణాలను సకాలంలో చెల్లించేలా చేయడం, వీధి వ్యాపారులను గుర్తించి వారి వ్యాపారాభివృద్ధికి రుణాలు మంజూరు చేయిస్తారు. అలాగే వీరిని ఆన్‌లైన్‌లో చేర్చి వెండర్స్ కార్డులను ఇప్పించడం, వారు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా చూస్తారు. దీంతో పాటు ప్రభుత్వం చేపట్టే ప్రజాపాలన, ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్‌లు పెట్టించడం, హరితహారం, పట్టణ ప్రగతి, తడి, పొడి చెత్తను వేరుచేయు విధానం, తడి చెత్తతో కంపోస్టు తయారు చేయూ విధానం, స్వచ్ఛసర్వేక్షణ్‌లో ఫోన్ ద్వారా ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం, మున్సిపాలిటిని ఓడీఎఫ్‌గా మార్చడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇంటింటికి తిరిగి మరుగుదోడ్ల నిర్మాణాలపై అవగాహన, అనాథ పిల్లల సర్వేనిరాశ్రయుల సర్వే తదితరాల్లో ఆర్‌పీలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమం విజయవంతం చేయడంలో, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విశ్వకర్మలకు ఆర్థిక లబ్దిచేకుర్చేందుకు అందించే పథకం కోసం పనిచేస్తున్నారు. ఇలా ప్రభుత్వాలు ఏ పథకాలు తీసుకువచ్చినా అమలుకు శాయశక్తుల ప్రయత్నం చేస్తూ వెట్టిచాకిరికి గురువుతున్నామని వాపోతున్నారు. అధికారులకు వినతులు ఇచ్చిన తమను పట్టించుకోడం లేదని ఆర్‌పీలు వాపోతున్నారు. ప్రభుత్వం తమకు నెలనెల జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

నెలల తరబడి జీతాలు రావడం లేదు

● భారతి, ఆర్‌పీల జిల్లా అధ్యక్షురాలు

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చే ప్రతి పథకాన్ని పట్టణ ప్రజలకు చేరువయ్యేలా చూడడంతో పాటు మహిళసంఘాలకు రుణాలు అందిస్తూ వారికి ఆర్థిక తోడ్పాటు అందేలా చూస్తున్నాం. అయినా తమకు కేవలం రూ.6 వేల జీతం మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుంది. ఆ జీతాలను సైతం గత 3 నెలలుగా ప్రభుత్వం నుంచి విడుదల కావడం లేదు. ప్రభుత్వం తమ జీతాలను నెలనెల చెల్లించాలి.

డిచ్‌పల్లి మున్సిపాలిటీ కలేనా..!?

● ప్రతీసారి ఎన్నికల సమయంలో మున్సిపాలిటీ ఏర్పాటుపై ప్రకటనలు ● అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకొని రాజకీయ పార్టీలు

డిచ్‌పల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లిని మున్సిపాలిటీ గా చేస్తానన్న ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యం చేస్తున్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి ప్రధాన కేంద్రంగా ఉన్న డిచ్‌పల్లి మండల కేంద్రం రోజురోజుకు అభివృద్ధి చెందుతంది. ఇక్కడ తెలంగాణ యూనివర్సిటీతో పాటు, ఏడో పోలీస్ బెటాలియన్, సీఎంసీ మెడికల్ కళాశాల, ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలు, డిచ్‌పల్లి మండల కేంద్రంలో రైల్వే స్టేషన్‌తో పాటు జాతీయ రహదారి 44 కూడా మండల కేంద్రం గుండా వెళ్తుంది. ఇన్ని సౌకర్యాలు ఉండటంతో చుట్టూ పక్కల మండలాలతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన ప్రజలు తమ వ్యాపారాల రీత్యా డిచ్‌పల్లిలో స్థిర నివా సాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో రోజురోజుకు డిచ్‌పల్లి విస్తీర్ణం పెరుగుతూ పోతుంది. అందుకు సరిపడా ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన పంచాయతీలకు సామర్థ్యం సరిపోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యాపరంగా డిచ్‌పల్లి ఒక హబ్‌గా ఏర్పడింది. త్వరలోనే ఇక్కడ మెడికల్ కళాశాల రానుందని ఇప్పటికే టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించిన విషయం తెలిసిందే. అన్ని రంగాల్లో ముందుకెళ్తున్న డిచ్‌పల్లిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం సైతం జోరుగా సాగుతుంది. లేఔట్లు, వెంచర్‌లలో భారీగా డిమాండ్ ఏర్పడింది. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరం ఉండటం అన్ని వసతులు డిచ్‌పల్లి ప్రాంతంలో ఉండటంతో జనాలు సైతం డిచ్‌పల్లిలో ఉండటానికి ఇష్టపడతున్నారు. డిచ్‌పల్లి మండల కేంద్రంతో పాటు నడిపల్లి,అమృతపూర్, సుద్దపల్లి, ఘన్‌పూర్, ఖిల్లా డిచ్‌పల్లి పోలీస్ క్యాంప్, ముల్లంగి ఇలా అన్ని గ్రామాలు కలిసినట్లుగానే ఇక్కడ ఉంటాయి. డిచ్‌పల్లిని మున్సిపాలిటీ గా చేస్తే మరింత అభివృద్ధి చెంది ఇక్కడి ప్రజలకు మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పించాలని డిచ్‌పల్లి వాసులు కోరుతున్నారు. ఈ విషయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ చొరవ తీసుకోవాలని ఆయన సైతం గతంలో ఇదే డిచ్‌పల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. కావున చొరవ తీసుకోవాలని, స్థానిక ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి మున్సిపాలిటీ ఏర్పాటు చేయించాలని స్థానికులు పేర్కొంటున్నారు.





డిచ్‌పల్లి గుండా వెళ్తున్న 44వ జాతీయ రహదారి

నిజాంసాగర్ కెనాల్‌కట్ట కబ్జాకు గురి

● ఇళ్లు, మడిగెల నిర్మాణం

● కళ్లు మూసుకుంటున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిజాంసాగర్ కెనాల్ కట్ట కొన్నేళ్లుగా కబ్జాకు గురవుతుంది. కబ్జా చేసిన ప్రతీఒక్కరు ఇంటి నిర్మాణం, వ్యాపారం కోసం మడిగెల నిర్మాణం చేసుకుం టున్నారు. ఇటు మున్సిపల్ అధికారులు అటు ఇరిగేషన్ అధికారులు కళ్లుండి చూడలేక పోతున్నారు. దీనికి తోడు ఫిర్యాదులు వస్తే మున్సిపల్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు ఒకసారి వెళ్ళి పనులను నిలిపివేస్తున్నారే తప్ప మళ్లీ అక్కడ పనులు ప్రారంభమైన ఫిర్యాదులు వచ్చిన అక్కడి చాయాలకు వెళ్ళడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఒక్కసారి వెళ్ళి చూసిన అధికారులు మళ్ళీ నిర్మాణం పూర్తయ్యే వరకు ఎందుకు వెళ్ళడంలేదో ఆ భగవంతునికే తెలుసు. అధికారులకు అమ్యామ్యులు అందగానే అక్కడికి వెళ్లకుండా ఉంటున్నారనే ప్రచారం జోరుగా ఉంది. నిజాంసాగర్ కెనాల్‌లో పిచ్చిమొక్కలు పెరిగి. కబ్జాదారుల ఇంటి డ్రైనేజీ నీరు నిజాంసాగర్ కెనాల్‌లోకి రావడంతో నీరు కలుషీతమవుతుంది. దీనికి తోడు కెనాల్‌లోకి పూడిక తీయాలంటే కష్టతరంగా మారింది. కొన్నేళ్లుగా నిజాంసాగర్ కెనాల్‌లోని పూడిక తీయడమే మరిచిపోయారు అధికారులు. గ్రామశివారులో కొద్దిదూరం పూడికను తీస్తున్నారే తప్ప అంకాపూర్ శివారు నుంచి టీచర్స్ కాలనీ, జర్నలిస్టుకాలనీ, రంగచారినగర్ వరకు పూడికను తీయలేకపోతున్నారు. ఇప్పుడైనా అక్రమ కట్టడాలను తొలగించి నిజాంసాగర్‌కెనాల్‌లో స్వచ్ఛమైన నీరు వచ్చేలా చూడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

అక్రమ కట్టడాలకు ఇంటి నెంబర్‌ల కేటాయింపు..

నిజాంసాగర్ కెనాల్ కట్టను కబ్జా చేసి ఇంటి నిర్మాణాలు, వ్యాపారం కోసం నిర్మించిన తాత్కాలిక షెడ్లకు మున్సిపల్ అధికారులు ఇంటి నెంబర్‌లను ఏలా కేటాయించారో అర్థం కావడం లేదు. ఇళ్లు కాని మడిగె కాని నిర్మాణం చేపడితే మున్సిపల్ అనుమతి తీసుకొని నిర్మాణం చేపట్టక ఇంటి నెంబర్ కేటాయించాలి లేదంటే తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న గుడారానికి సీరియల్‌గా వచ్చే సంఖ్యను 012345ల కేటాయించాలి. నిబంధనలను తుంగలో తొక్కి మున్సిపల్ అధికారులు సక్రమైన ఇంటి నెంబర్‌లను కేటాయిస్తున్నారు. దీంతో కబ్జాదారులు కొందరు ఆ స్థలాలను తమ కుటుంబసభ్యుల పేరు పైనా రిజిస్ట్రేషన్‌లు చేసుకుంటున్నారు. దీంతో కబ్జాదారుడు కాస్త హక్కుదారుడు అవుతున్నారు. మున్సిపల్ పరిధిలో ఇలా అక్రమంగా కేటాయించిన ఇంటి నెంబర్‌లు సుమారుగా 600లకు పైగా ఉన్నాయనే సమాచారం. ఇన్ని కేటాయింపులో అధికారులకు, నాయకులకు ఎంత డబ్బు చేతులు మరిందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. గత పాలనలో నాయకులు అధికారులను నచ్చజెప్పి వినకుంటే బెదిరించి అసైన్డ్ ప్రభుత్వ భూములకు ఇంటి నెంబర్‌లను కేటాయించుకున్నారని, దీంతో పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదించారని, మున్సిపల్‌కు రావల్సిన ఆదాయానికి గండి ఏర్పడిందని ప్రజలు గుసగుసలాడుతున్నారు. మున్సిపల్‌లో ఉన్న ప్రతిపక్ష సభ్యులు గతంలో మున్సిపల్ సమావేశంలో నిలదీసిన సంఘటనలు ఉన్నాయి. ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. ఇటీవల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ రాజు కొంత మేర విచారణ చేపట్టి 140 నెంబర్‌లను తొలగించారు. గతంలో కేటాయించిన నెంబర్‌లను విచారణ చేపట్టకుండా కొన్నింటిని తొలగించడంతో వారు కార్యాలయం చుట్టూ నాయకుల చుట్టు ప్రదక్షణలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా అట్టి కబ్జాదారుల వ్యాపారాలకు విద్యుత్ మీటర్‌లను ఏలా కేటాయించారో అర్థం కావడంలేదు. వ్యాపారం నిర్వహించే షెట్టర్‌లకు మున్సిపల్ అనుమతి లేనిదే విద్యుత్ మీటర్‌ను కేటాయించరాదు. కానీ ముందుగానే విద్యుత్ మీటర్లు ఇచ్చి తర్వాత అక్రమంగా ఇంటి నెంబర్‌లను కేయించుకున్న సంఘటనలు కోకోల్లాలు. ఇట్టి విద్యుత్ మీటర్ల కేటాయింపుపై విచారణ జరిపి ఏ కేటగిరి కింద కేటాయించారో అధికారులు తెల్పాల్సింది ఉంది. గత ఏడేళ్ళ నుంచి ఇప్పటి వరకు ఉన్న మున్సిపల్ అధికారులు సక్రమైన ఇంటి నెంబర్‌లను కేటాయించడంతో కబ్జాదారులు ఇదే అదునుగా భావించి ఖాళీ స్థలాలను కబ్జా చేసుకొని నిర్మాణాలు చేపడుతున్నారని, వీటిని అడ్డుకట్ట వేసేవారు లేకుండా పోయారని ప్రజలు భావిస్తున్నారు.



కెనాల్ కట్టపై కబ్జా చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్న దృశ్యం

పశు వైద్యం.. అందని ద్రాక్షేనా..!?

● ఖాళీగా ఉన్న పోస్టులు ● అసిస్టెంట్‌లతో సర్దుబాటు ● మృత్యువాత పడుతున్న పశువులు ● పట్టనట్టు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు ● వైద్యులను అందించాలంటున్న రైతులు

నసురుల్లాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పశు గణన సర్వే ఓవైపు కొనసాగుతుంది. కాని అనుకున్న స్థాయిలో వైద్యులు లేకపోవడంతో పశువులు మృత్యువాత పడుతున్నాయి. వివిధ విభాగాల్లో మొత్తం 26 ఖాళీలు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి. అయితే అందులో లీవ్ స్టాక్ అసిస్టెంట్ (ఎల్‌ఎస్‌ఏ) పోస్టులు 9 ఖాళీలు ఉండగా ఒక్క నసురుల్లాబాద్ మండలంలో ఐదు పశువైద్య ఉప కేంద్రాలు ఉండగా అందులో నాలుగు ఖాళీలు ఉండటం విడ్డూరం. దీంతో ప్రజలకు పశువైద్యం అందని ద్రాక్షాలా మారింది. కేవలం అసిస్టెంట్‌లతోనే కాలం వెల్లదీస్తు న్నారు. ఈ మధ్య కాలంలో ప్రభుత్వం వీఆర్‌ఏలను వివిధ శాఖలలో నియమించడంతో పశు వైద్యశాఖలోనూ ఉన్నారు. ఎటువంటి అవగాహన లేక కేవలం రైతులు వెళ్లి అడిగిన మందులు ఇవ్వడమే వారి విధిగా మారింది. అందులో భాగంగా నసురుల్లాబాద్ మండలంలో బొమ్మన్‌దేవ్‌పల్లి, నాచుపల్లి, మిర్జాపూర్, నసురుల్లాబాద్‌లలో సిబ్బంది కొరత ఉండగా అసిస్టెంట్‌లే డాక్టర్ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో దుర్కిలో ఉన్న ఎల్‌ఎస్‌ఏ నాలుగు గ్రామాల పరిధిలో ఉన్న పశువులకు దిక్కు అయ్యారు.

● డాక్టర్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి



నసురుల్లాబాద్ మండలకేంద్రంలో డాక్టర్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మధ్య కాలంలో నా ఆవు సైతం సరైన వైద్యం అందక మృతి చెందింది. మండల కేంద్రంలోనే ఎప్పుడు సేవలు అందించే వైద్యున్ని నియమించాలి.

\- నర్సింలుగౌడ్, నసురుల్లాబాద్, రైతు

డిజిటల్ విద్యాబోధనకు కోనాపూర్ పాఠశాల విద్యార్థుల ఎంపిక



కోనాపూర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్లు

కమ్మర్‌పల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపూర్ ఉన్నత పాఠశాల ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ద్వారా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబోధన కోసం ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చౌడారపు రాంప్రసాద్ తెలిపారు. ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం ద్వారా తెలుగు ఆంగ్ల, గణిత పాఠాలు కంప్యూటర్ల ద్వారా విద్యార్థులకు నేర్పిస్తామన్నారు. అతితక్కువ సమయంలో నాణ్యతతో కూడిన ఇంటరాక్టివ్ పాఠాలు నేర్చుకునే అవకాశం లభిస్తుందన్నారు. అయితే ప్రామిక పాఠశాల విద్యార్థులు కంప్యూటర్ల ద్వారా విద్య నేర్చుకునే అవకాశం కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ పాఠశాలకు దక్కడం ఆనందదాయకమన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఎన్.ఆంధ్రయ్య కోరారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

ఆర్మూర్‌రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నూతన శీల ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు పూర్ణహుతి, యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మామిడిపల్లి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్ ఆరోపణలు అవాస్తవం



విలేకరులతో మాట్లాడుతున్న ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్

● అభివృద్ధి అంటేనే కాంగ్రెస్
● ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్

నిజామాబాద్ అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీ అర్వింద్ ఆరోపణలు అవాస్తవం అని ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నుడా చైర్మన్ కేశవేణుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిపై పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. గతంలో పీవీ నర్సింహారావు కేంద్ర మంత్రిగా, ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు దేశ వ్యాప్తంగా నవోదయ పాఠశాలలు ప్రారంభిస్తే అందులో ఒకదానిని నిజాంసాగర్ ప్రాజెక్టు పక్కనే అచ్చంపేటలో ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. ప్రస్తుతం 9 జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంటే స్థల సేకరణలో బోధన్‌లో ఉంచాలని సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వానికి లేఖ రాశారని అన్నారు. అలాంటి సుదర్శన్‌రెడ్డిపై తీవ్రమైన ఆరోపణలు చేయడం ఎంపీ అర్వింద్‌కు తగదన్నారు. నవోదయ పాఠశాలలను ఎక్కడ ఏర్పాటు చేయాలి అనేది రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా కలెక్టర్లు నిర్ణయం తీసుకుంటారనే విషయం అర్వింద్‌కు తెలియక పోవడం సిగ్గుచేటన్నారు. కేవలం నిజామాబాద్ జిల్లాలో మాత్రమే పాఠశాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది కానీ స్థలాన్ని ఇంకా ఫైనల్ చేయలేదన్నారు. ప్రతీ ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలని కోరుకుంటారని అన్నారు. అలాంటిది నవోదయ పాఠశాలకు అనువైన 30 నుంచి 35 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వ అధికారులు, కలెక్టర్లు పరిశీలించి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం ట్రిబుల్ ఐటీని కూడా బాసరలో ఏర్పాటు చేసిందని దాని ఫలితంగానే నేడు విద్యార్థులు ఉన్నత స్థితిలో ఉన్నారని అన్నారు. అర్వింద్ మొదటిసారి పార్లమెంట్‌కు ఎన్నికైనప్పుడు నిజాం ఫ్యాక్టరీని తెరిపిస్తానని చెప్పి ఇంతవరకు ఆవిషయం ఊసేఎత్తడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి సభ్యులుగా బోధన్ షుగర్ ఫ్యాక్టరీ తెరిపించే ప్రయత్నం చేస్తున్నారని ఇది కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఇందులో భాగంగానే రూ.400 కోట్ల బకాయిలు ఉన్న షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించి రూ.200 కోట్లను ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు. నవోదయ పాఠశాల ఎక్కడ ఏర్పాటు చేయాలనేది అధికారులే చూస్తారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో నందిపేటలో 450 ఎకరాలను సెజ్‌కు కేటాయిస్తే అర్వింద్ ఆరు సంవత్సరాల్లో ఒక్క ఇండస్ట్రీయల్‌ను కూడా తీసుకురాలేదన్నారు. జిల్లాలో మూడు ఫ్లై ఓవర్‌లు పది సంవత్సరాలుగా నత్తనడకన నడుస్తున్నాయని వాటిని పూర్తి చేయాలని అర్వింద్‌ను డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లాకు మెడికల్ కళాశాల, యూనివర్సిటీని తెచ్చిన ఘనత సుదర్శన్‌రెడ్డిదన్నారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి తాను మంత్రిగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని అర్వింద్‌ను ప్రశ్నించారు. అర్వింద్ మాట్లాడే ముందు ఆలోచించి మాట్లాడాలనిఅన్నారు. ఎంపీగా ఆరేళ్లలో ఒక్క నియోజకవర్గానికి నాలుగులైన్‌ల రోడ్డు తీసుకురాలేదన్నారు. ప్రజల సమస్యల గురించి పట్టించుకోకుండా కేవలం పత్రికల్లో కనబడాలని మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరన్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిని మార్చే ఆలోచనలో ఉన్న బీజేపీ అధిష్టానం దృష్టిలో పడేందుకు అత్యుత్సాహంతో కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ఆరోపణలు మానుకోకుంటే ఆయనకు బుద్ధి చెప్పే కార్యక్రమం చేపడుతామన్నారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని ఒక్క ఎలక్షన్‌లో గెలవగానే అహంకారంతో మాట్లాడితే అది అర్వింద్ అవివేకమేనని అన్నారు. నుడా చైర్మన్ కేశవేణు మాట్లాడుతూ అర్వింద్ సుదర్శన్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. అర్వింద్ ఎంపీగా గెలవడమే అదృష్టమని అలాంటిది ఇతర పార్టీల నాయకులపై ఆరోపణలు చేస్తే ప్రజలు ఊరుకోరన్నారు. నిజామాబాద్ జిల్లాలో గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి గడప గడపకు నీటిని తెచ్చిన ఘనత సుదర్శన్‌రెడ్డిదన్నారు. గడిచిన ఆరేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం నుంచి జిల్లాకు ఎన్ని నిధులు తెచ్చారో వివరించాలని ఎంపీని డిమాండ్ చేశారు. మతం పేరుతో ఓట్లు రావని అభివృద్ధికే ప్రజలు పట్టం కడతారని అన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడతారని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి, రాష్ట్ర ప్రచారక్ కమిటీ సభ్యుడు జావీద్ అక్రమ్, యూత్ కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు గోపి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణురాజ్, నాయకులు కేశమహేష్, శివకుమార్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

మార్కుల కోసం కాకుండా లక్ష్యం కోసం చదవాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ జి.బాలకిషన్

సిరికొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షల కోసం, మార్కుల కోసం కాకుండా లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జి.బాకిషన్ కోరారు. సిరికొండలో ఆదివారం జరిగిన పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదని బాధ్యతగా భావించాలని ఉన్నత స్థాయి వ్యక్తుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని సాధన చేస్తే ఉన్నత శిఖరాలకు మార్గం అవుతుందని ఆయన అన్నారు. చదువు అనేది కేవలం పరీక్షలు మార్కుల కోసమే కాదని తమ జీవితాలను ఇతరులకు ఆదర్శంగా ఉండటం కోసం మంచి స్థాయిలో నిలబడడం కోసం చదవాలని అలా చదివి పరీక్షలు రాస్తే మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారని అన్నారు. పాఠశాల విద్య అనేది జీవితంలో అత్యంత కీలకమైనదని విషయ పరిజ్ఞానంతో కూడిన విద్యను పెంపొందించుకోవడంలో ప్రతీ విద్యార్థి ముందుండాలని కోరారు. దేశంలోనే ప్రసిద్ధిచెందిన వివిధ ఉన్నత విద్యాసంస్థలలో చదవడం లక్ష్యంగా పెట్టుకొని శ్రమిస్తే దేశం గర్వించే స్థాయికి ఎదుగుతారని ఆయన సూచించారు. విద్యార్థి దశ నుండే శాస్త్రీయ దృక్పథాన్ని ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని అది మన అంతరాలలో ఉన్న నిగూఢమైన వ్యక్తులను సమాజానికి పరిచయం చేస్తుందన్నారు. చదవడం అనేది భారంగా కాకుండా బాధ్యతగా భావించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి సాల్మన్, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలయ్య, పాఠశాల హెచ్ఎంనర్సయ్యలు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం



సిరికొండలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరికొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సిరికొండ మండల కేంద్రంలో రూ.5లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్డు పనులను ఆదివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన భూపతిరెడ్డి సిరికొండ గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నారని ఒక డ్రైనేజీకి రూ.5లక్షలకు, సిమెంట్ రోడ్డుకు రూ.5లక్షలు మంజూరు అయ్యాయని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దేగం సాయన్న, దిగంబర్, భాస్కర్‌రెడ్డి, రమేష్, సుదర్శన్‌గౌడ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలో గంజాయి పట్టివేత



గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

ఖిల్లా,మార్చి 9(ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలో గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అతని వద్దనుంచి 250గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు ఒకటోటౌన్ ఎస్‌హెచ్‌వో బి.రఘుపతి తెలిపారు. ఖచ్చితమైన సమాచారం మేరకు ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. ఈ విచారణలో నవీపేటకు చెందిన బీర ప్రవీణ్‌గా గుర్తించారు. అయన ప్రస్తుతం నిర్మల్ జిల్ల తానూర్ మండలం ఎలవాత్ గ్రామానికి చెందిన వాడుగా అంగీకరించాడు. ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ మొగలయ్య, సిబ్బంది ఖాలేద్‌లు ఉన్నారు.

పతాంజలి యోగా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



మహాలక్ష్మీనగర్‌లో మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహరుషి పతాంజలి మహిళా యోగా కేంద్రం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం నగరంలోని మహాలక్ష్మినగర్‌లోగల మహరుషి పతాంజలి మహిళా యోగా కేంద్రంలో మహిళలను శాలువా, మెమోంటోతో సత్కరించారు. వివిధ రంగాలలో విశేష కృషి చేసిన పలువురిని సత్కరించి వారు సమాజానికి చేసిన సేవలను ప్రభాకర్, కిషన్‌జీలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహంకాళ విజయ్‌కుమార్, వేదమిత్ర తదితరులు పాల్గొన్నారు.

రవన్న ఆశయ సాధనకు ఉద్యమిద్దాం



సిరికొండలో వర్ధంతి సభలో పాల్గొన్న నాయకులు

సిరికొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ న్యూడెమోక్రసీ కార్యదర్శిగా పనిచేసి అమరుడైన రవన్న ఆశయ సాధన కోసం పోరాడుదామని పార్టీల నాయకులు బాలయ్య, రామకృష్ణ అన్నారు. సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో ఆదివారం రవన్న వర్ధంతి సభను సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు వేరువేరుగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి కారల్‌మార్క్స్, ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షుడు నిమ్మల భూమేష్, గులామ్ హుస్సేన్, పీవైఎల్ మండల అధ్యక్షుడు సంజీవ్, కృష్ణ, రాములు, సీపీఐఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు రమేష్, మల్కె లింబాద్రి, ఇ.రమేష్, నారాగౌడ్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

నిజామాబాద్ కల్చరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):త్వరలో జరగబోయే పదో తరగతి విద్యార్థులకు పరీక్షా కేంద్రాల వద్ద తగిన సౌకర్యాలు కల్పించాలని సామాజిక రచయితల సంఘం ప్రతినిధులు వేముల శేఖర్, ప్రేమ్‌లాల్ కోరారు. ఆదివారం నగరంలోని వినాయక్‌నగర్‌లోగల సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సెస్సీ పరీక్ష కేంద్రాలలో కనీస వసతులు కల్పిస్తూ మాస్ కాపీయింగ్ జరుగకుండా చూడాలని కోరారు. పరీక్షలు జరిగే రోజులలో విద్యార్థులకు ఎలాంటి భయాలు కలుగకుండా అధికారులు చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ పాల్గొన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ కోఆర్డినేషన్ టీమ్‌లో తాహెర్‌బిన్ హందాన్

నిజామాబాద్ అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):జైబాపు, జైభీమ్, జైసం విధాన్ స్టేట్ కోఆర్డినేషన్ బృందాన్ని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రకటించింది. మాజీ ఎంపీ చెల్లవంశీచంద్‌రెడ్డితో పాటు రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, బెల్లయ్య నాయక్, సంపత్‌కుమార్, గుమ్మడి వెన్నెలను కమిటీలో నియమించగా జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్‌ను సైతం స్టేట్ కోఆర్డినేషన్ టీమ్‌లో నియమించారు.

ఎంపీ అర్వింద్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

● జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



నిజామాబాద్ అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా ఎంపీ అర్వింద్ చేస్తున్న ఆరోపణలు జిల్లా ప్రజలు గమనిస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తున్న ప్రతీసారి ప్రజలను తప్పుదోవ పట్టించాలనే ప్రయత్నం చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. గత సంవత్సరం పసుపు ధర పెరిగితే కేంద్ర ప్రభుత్వం వల్లనే పెరిగిందని చెప్పిన ఎంపీ ప్రస్తుతం ధర రోజురోజుకు తగ్గుతుంటే దాని నుంచి తప్పించుకోవడానికి కాంగ్రెస్ నాయకులపై అవాకులు చెవాకులు పేలుతున్నాడని అన్నారు. ప్రజల నుంచి కేంద్రంపై వస్తున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించడానికే జవహర్ నవోదయ అంశాన్ని ముందుకు తీసుకువచ్చారని పెద్దలను గౌరవించాలనే సంస్కారం లేని వ్యక్తి అర్వింద్ అన్నారు. పెద్దవారిని గౌరవించినప్పుడే రాజకీయ నాయకుడిగా భవిష్యత్తు ఉంటుందని కేవలం ఎన్నికల్లో గెలుపు ఓటముల వల్లే రాజకీయ నాయకుడి లక్షణం అనుకుంటే అది తెలివితక్కువ ఆలోచన అన్నారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి జవహర్ నవోదయ పాఠశాలను తన ప్రాంతానికి వస్తే బాగుంటుం దని ఆలోచించారచ్చు గానీ అందరి ఎమ్మె ల్యేలతో మాట్లాడుతున్నానని చెబుతున్నా అర్వింద్ మరి ఎందుకు సుదర్శన్‌రెడ్డికి ఫోన్ ద్వారా సంప్రదించే ప్రయత్నం చేయలేదో జవాబు చెప్పాలన్నారు. ప్రజాసమస్యలను పక్కనబెట్టి కేవలం మాటలతో పబ్బం గడు పుకునే అర్వింద్‌కు ప్రజలే రాబోయే రోజుల్లో జవాబు చెబుతారని అన్నారు. అబద్ధపు మాటలు నిందారోపన పనులు చేస్తే గతంలో బీఆర్ఎస్ నాయకులు ఏ విధంగా అర్వింద్‌పై దాడి చేశారో భవిష్యత్తులోనూ కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే అవకాశం ఉందన్నారు. జిల్లా అభివృద్ధిలో సుదర్శన్‌రెడ్డి పాత్ర గురించి ప్రశ్నించే హక్కు అర్వింద్‌కు లేదన్నారు. ఇకనైనా హుందాగా ఉండాలన్నారు.

గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానిస్తున్న ధర్పల్లి గ్రామస్థులు

ధర్పల్లి,మార్చి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శాఖ గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోగల శాఖ గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో మౌలిక సదుపాయాల కోసం రూ.5లక్షలు మంజూరు కాగా నిధులకు సంబంధించి పనులను ఆయన పర్యవేక్షించారు. పనులు పూర్తికావడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఇందల్వాయి, ఏర్గట్ల మండలాల్లో కొత్త గ్రంథాలయాలు మంజూరు అయ్యాయని వాటిని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. సిరికొండ మండలంలో గ్రంథాలయ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యాయని స్థలాన్ని కేటాయించగానే పనులు ప్రారంభిస్తామన్నారు. మండల కేంద్రంలోగల శాఖ గ్రంథాలయంలో వైఫై సౌకర్యాన్ని 24గంటల్లో ప్రారంభించాలని స్థానిక గ్రంథ పాలకుడికి ఆదేశాలు ఇచ్చారు. గ్రూప్, పోటీ పరీక్షల కోసం ప్రత్యేకంగా పుస్తకాలు వచ్చాయని నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చెలిమెల నర్స య్య, ధర్పల్లి సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున్, మాజీ సర్పంచ్ మిట్టపల్లి గంగారెడ్డి, సుభాష్, సురేందర్‌గౌడ్, బాలయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంగిత్యానాయక్, పోతరాజు,అబ్దుల్ హమీద్, చెలిమెల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి కోసం బోరు బావికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే

సిరికొండ మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సిరికొండ గ్రామ పరిదిలోని మహిపాల్ తండాలో తాగు నీటి కోసం బోరు బావికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి రూ.ల క్షా ఇరువైవేలు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు దేగాం సాయన్న,దిగంబర్ తెలిపారు.మంజూరైన నిధులతోఆది వారం తండాలో బోరు బావిని తవ్వించగా నీళ్ల వచ్చాయని వారు తెలిపారు. బోరు మోటారు కోసం లక్షా ఇరువై వేలు మంజూరయినట్లు వారు తెలిపారు. కొబ్బరి కాయలు కొట్టి బోరు బావిని తవ్వే కార్యక్రమాన్ని తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. రాజునాయక్, చీన్యానాయక్, భాస్కర్‌నాయక్, రాములు నాయక్, రవి నాయక్,సంతోష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఒలింపియాడ్‌లో ముప్కాల్ విద్యార్థులు



బహుమతులను అందుకున్న విద్యార్థులు

ముప్కాల్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జాతీయ స్థాయిని నిర్వహించి ఒలింపియాడ్ మ్యాథ్స్, సైన్స్ పరీక్షల్లో న్యూహరిజోన్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ సాధించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రవిలాస్ తెలి పారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలు విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. న్యూహరిజోన్ పాఠశాలకు చెందిన వి.శ్రీహన్ జాతీయస్థాయి 10వ ర్యాంకు, సృజన్ రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకు, ఎ.విహాన్ జిల్లాస్థాయిలో 10వ ర్యాంకు సాధించగా వారికి బహుమతులను అందజే శారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రత్నకర్, శైలజ, డి.నిల,రుచిత, తదితరులు పాల్గొన్నారు.

బోర్గాం(పి)లో ఉమామహేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న పిట్ల కృష్ణమహరాజ్

మోపాల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బోర్గాం(పి) గ్రామంలో బీరప్ప యూత్ ఆధ్వర్యంలో పిట్లకృష్ణ మహారాజ్ చేతుల మీదుగా ఉమామహేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం చేశారు. గ్రామంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేసేందుకు యూత్ సభ్యులు నిరంతరం కృషి చేశారని అన్నారు. అందరి సహకారంతో ఉమామహేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కురుమ సంఘం నాయకులు, బీరప్ప యూత్ సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అమ్రాద్‌తండా దాడి ఘటనలో నిందితుల అరెస్టు

మాక్లూర్, మార్చి9(ఆంధ్రజ్యోతి):అమ్రాద్ తండాలో శనివారం శనివా రం జరిగిన దాడి ఘటనలో నిందితులైన కేతావత్ రమేష్ అలియాస్ విక్రం, కేతావత్ పీర్‌సింగ్‌లను ఆదివారం అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. రేషన్‌షాప్‌లో తమకు అదనంగా బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రేషన్‌డీలర్ మాలోత్ సునీత వద్ద కేతావత్ రమేష్, కేతా వత్ పీర్‌సింగ్‌లు ఘర్షణకు దిగారు. దీంతో సునీత తన కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో జ్యోతిరాంనాయక్, రాజునాయక్, శ్రీని వాస్‌నాయక్‌లు వచ్చి వారితో ఘర్షణకు దిగారు. దీంతో విక్రం పదునైనా కత్తితో ముగ్గురిపై దాడి చేశాడు. ఈ దాడి ఘటనలో విక్రం దాడికి ఉపయో గించిన కత్తిని స్వాధీనం చేసుకొని కేతవత్ విక్రం, పీర్‌సింగ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ ముగ్గురు అన్నదమ్ముళ్ల పరిస్థితి నిలకడగా ఉందన్నారు.

ధర్మోరాలో గల్ఫ్ మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

మోర్తాడ్, మార్చి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మోరా గ్రామానికి చెందిన పత్రి రాజేశ్వర్ కుటుంబానికి తెలంగాణ గల్ఫ్ సమితి కార్మిక సంఘం తెలంగాణ గల్ఫ్ ఏజేఏసీ సభ్యుడు రూ.23లక్షల 80వేల మృతుని భార్య అకౌంట్‌లో జమ చేశారు. మృతుని తండ్రి రాజేశ్వర్ కత్తార్ దేశానికి వెళ్లి అక్కడ తెలంగాణ గల్ఫ్ సమితిలో సాంస్కృతిక బృందంలో డప్పు కళాకారుడిగా పలు కార్యకరమాల్లో పాల్గొనేవాడు. కాగా తెలంగాణ గల్ఫ్ సమితి కార్మిక సంఘం వారు అతనికి రూ.125రియల్స్‌తో ఐటీబీఎఫ్ ప్రమాద బీమా ఇన్సూరెన్స్ చేయించారు. దురదృష్టావశాత్తు పత్రి రాజేశ్వర్ మరణించడంతో ఆయన భార్య అకౌంట్‌లో డబ్బులు జమ చేయించారు. భార్య, వికలాంగురాలైన కూతురు ఏం తోడు లేని ఇద్దరు అక్కలు ఇన్సూరెన్స్ ద్వారా లబ్ధిపొంది అనాథలు కాకుండా కాపాడిందని వారు తెలిపారు. అంతేగాక గల్ఫ్‌లో మరణించిన కార్మికులకు ప్రభుత్వం ద్వారా వచ్చే రూ.5లక్షల ఎక్స్‌గేషియా మంజూరు చేయిస్తామని గల్ఫ్ జేసీ ఉద్యమ నాయకుడు పెన్నమనేని శ్రీనివాస్‌రావు గుగ్గిళ్ల రవిగౌడ్, సుందరగిరి శంకర్‌గౌడ్, హరం మారుతిలు కుటుంబానికి హామీ ఇచ్చారు. కాగా కుటుంబసభ్యులు తమకు ఇన్సూరెన్స్ డబ్బులు అందించనందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



ధర్మోరాలో మృతుడి కుటుంబసభ్యులను కలిసిన గల్ఫ్ జేఏసీ సభ్యులు

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.230	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.88400	రూ.81500	రూ.990

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్
స్క్రీన్-1 : చావా (తెలుగు) (10.00)
: కింగ్‌స్టన్ (1.20, 7.40)
: చావా (హిందీ) (4.20)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (10.40)
స్క్రీన్-2 : సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (10.15)
: చావా (హిందీ) (1.30, 10.50)
: శివంగి (4.50)
: చావా (తెలుగు) (7.30)
స్క్రీన్-3: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (10.25)
: చావా (తెలుగు) (1.35)
: మిక్కీ17 (ఇంగ్లీష్) (4.55, 7.50)
: కింగ్‌స్టన్ (10.45)
స్క్రీన్-4: నారి (10.35)
: మిక్కీ17 (ఇంగ్లీష్) (1.10)
: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (4.05, 10.30)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (7.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..
స్క్రీన్-1 : చావా (తెలుగు) (11.00, 1.45, 4.40, 7.35, 10.30)
స్క్రీన్-2 : సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (1.30, 7.30)
: చావా (హిందీ) (4.35, 10.30)
స్క్రీన్-3 : జిగేల్ (11.00)
: కింగ్‌స్టన్ (1.30, 7.30)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (4.40, 10.20)

దేవి : మజాకా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : చావా (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్